

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాలలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA
APTEL/2024/89102
# విజ్ఞాన్ పత్రిక
తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 88 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి గురువారం 30 ఏప్రిల్ 2026 పేజీలు : 04 వెల : 02




## ఐదింటిలో మేమే గెలుస్తాం!

ఎన్నికల ఫలితాలతో వికసిత్ భారత్ సంకల్పం బలోపేతం

దేశ పురోగతి వేగానికి ఈ ఫలితాలు నూతన శక్తిని ఇస్తాయి

ప్రధాని నరేంద్ర మోదీ ధీమా

పశ్చిమ బెంగాల్ ప్రజలకు కృతజ్ఞతలు

గంగా ఎక్స్‌ప్రెస్ వే ప్రారంభం

వారణాసిలో మోదీ రోడ్ షో



## యుద్ధం ముగిసిందని భావించొద్దు

హోర్ముజ్ మా నియంత్రణలోనే : ఇరాన్ సైన్యం హెచ్చరిక

భూభాగంపై దాడికి శత్రువులు ధైర్యం చేయలేదన్న వ్యాఖ్య

అమెరికా నౌకలను తగలబెట్టేస్తాం : ఐఆర్‌జీసీ వార్నింగ్

మా నౌకల సీజ్ సముద్రపు దొంగతనమే : ఇరాన్

వాషింగ్టన్: ఇరాన్–అమెరికా మధ్య కొనసాగు తున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ సైన్యం కీలక వ్యాఖ్యలు చేసింది. అమెరికాతో యుద్ధం ఇంకా ముగియలేదని స్పష్టం చేసింది. కాల్పుల విరమణ



## ఇరాన్‌కు వీసా కష్టాలు



న్యూఢిల్లీ : 2026 ఫిఫా ప్రపంచకప్‌లో పోటీపడతామని ఇరాన్ ప్రకటించినా.. మంగళవారం వాంకోవర్ (కెనడా)లో జరిగిన ప్రపంచ ఫుట్‌బాల్ అధినేతల సమావేశానికి ఇరాన్ హాజరు కాలేదు. బుధవారం వాంకోవర్ వేదికగా ఆసియా ఫుట్‌బాల్ దేశాలతో ఫిఫా అధ్యక్షుడు జియాని ఇన్ఫాంటినో భేటీ అయినా.. ఇరాన్ గైర్హాజరు అంశం చర్చకు రాలేదని సమాచారం. అమెరికా, మెక్సికో సంయుక్తంగా ఫిఫా ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇస్తున్న సంగతి తెలిసిందే.

## ఒడిశాలో బస్సు, ట్రక్కు ఢీ... నలుగురు మృతి

ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నేషనల్ హైవే 143పై ప్రైవేట్ బస్సు నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను ఢీకొని, ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా, 20 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో బస్సు డ్రైవర్, ట్రక్కు డ్రైవర్‌తో పాటు ఇద్దరు ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం అనంతరం అగ్నిమాపక సిబ్బంది గ్యాస్ కట్టర్లతో బస్సును కట్ చేసి ప్రయాణికులను బయటకు తీశారు. గాయపడిన వారిని రూర్కెలా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# రెండో దశలోనూ రికార్డ్ స్థాయిలో పోటెత్తిన ఓటర్లు

పార్టీల పోటాపోటీ ప్రచారంతో హోరెత్తిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు కూడా ఒకట్రెండు సంచలన అంచనాలతో హోరెత్తాయి. పశ్చిమ బెంగాల్‌లో తుది విడత పోలింగ్ బుధవారం సాయంత్రం ముగిసిన వెంటనే ఫలితాలను ఆయా సర్వే సంస్థలు ప్రకటించాయి. కీలక రాష్ట్రమైన బెంగాల్‌లో ఈసారి మమతా బెనర్జీ పార్టీకి పరాజయం తప్పదని కొన్ని సంస్థలు వెల్లడించగా, ఆమె వరుసగా నాలుగోసారి అధికారంలోకి రావడం తథ్యమని మరికొన్ని సంస్థలు అంచనా వేశాయి. మరో పెద్ద రాష్ట్రమైన తమిళనాడులో అధికార డీఎంకే కూటమి స్పష్టమైన మెజార్టీతో మళ్లీ జయకేతనం ఎగురవేయనున్నట్లు అత్యధిక ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు తెలిపాయి. దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీకే) మూడో అతిపెద్ద పార్టీగా అవతరించే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నాయి. ఇక్కడ అన్నాడీఎంకే కూటమి రెండో స్థానంలో నిలుస్తుందని వెల్లడించాయి. అయితే విజయ్ మరో ఎంజీఆర్‌గా అవతరించబోతున్నారని యాక్సిస్ మై ఇండియా సంస్థ ప్రకటించడం గమనార్హం. టీవీకే పార్టీ 35 శాతం ఓట్లతో 98 నుంచి 120 స్థానాలు గెల్చుకొని అతిపెద్ద పార్టీగా నిలవబోతోందని ఆ సంస్థ తేల్చిచెప్పింది. అస్సాంలో ఎన్డీయే మరోసారి నెగ్గడం ఖాయమని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు స్పష్టంచేశాయి. కమ్యూనిస్టుల అడ్డా అయిన కేరళలో ఈసారి వారికి పరాభవం తప్పదని, పినరయి విజయన్ గద్దె దిగబోతున్నట్లు పేర్కొన్నాయి. రాష్ట్రంలో వామపక్ష కూటమి ఎల్డీఎఫ్ ఓడిపోతుందని, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అధికారంలోకి వచ్చే సూచనలున్నాయని వెల్లడించాయి. కేరళ ప్రజలు మార్పునకు అనుకూలంగా ఓటు వేశారని తెలిపాయి. పుదుచ్చేరిలో ఎన్డీయేకు మళ్లీ స్పష్టమైన విజయావకాశాలు ఉన్నట్లు అభిప్రాయపడ్డాయి.

**టీఎంసీపై బీజేపీకి స్వల్ప ఆధిక్యం :** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌పై బీజేపీ స్వల్ప ఆధిక్యత సాధిస్తుందని మాట్రిజ్, పి--మార్క్ ఫలితాలు తెలియజేశాయి. టీఎంసీకి 125--140 స్థానాలు వస్తాయని, బీజేపీకి 146--161 స్థానాలు లభిస్తాయని మాట్రిజ్ వెల్లడించింది. పి--మార్క్ అంచనా ప్రకారం బీజేపీకి 150--174 సీట్లు, టీఎంసీకి 118--138 సీట్లు లభిస్తాయి. బీజేపీకి 142--171, టీఎంసీకి 99--127 సీట్లు లభించేందుకు ఆస్కారం ఉన్నట్లు 'పోల్ డైరీ'ఎగ్జిట్ పోల్ తేల్చింది. అయితే, ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పిన సందర్భాలు గతంలో ఉన్నాయి. వాస్తవమైన ఫలితాలను అంచనా వేయడంలో అవి విఫలమయ్యాయి.

# యుద్ధం ముగిసిందని భావించొద్దు

ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, పరిస్థితిని యుద్ధంగానే పరిగణిస్తున్నామని సైన్య ప్రతినిధి అమీర్ అక్రమినియా తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వ ప్రసార సంస్థ, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్ (ఐఆర్ఐబీ) తెలిపింది. సైనిక దృక్కోణం నుంచి చూస్తే పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉందని అక్రమినియా తెలిపారు. పరిస్థితి ఇంకా యుద్ధంగానే ఉందని, లక్ష్యాలు, సైనిక సామగ్రి ప్రణాళికలను నవీకరించామని చెప్పారు. ఇది ఇరాన్ సైన్యం పూర్తి సిద్ధతలో ఉందని సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పూర్తి నియంత్రణ కలిగి ఉందని ఆయన చెప్పారు. పశ్చిమ భాగాన్ని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నిర్వహిస్తుండగా, తూర్పు భాగాన్ని సాధారణ సైన్యం పర్యవేక్షిస్తోందని వివరించారు. ఎన్ని బెదిరింపులు వచ్చినా, శత్రువులు భూభాగంపై దాడి చేయడానికి ధైర్యం చేయలేదని అక్రమినియా పేర్కొన్నారు. ఇరాన్ భూసేనల సిద్ధత, ఐఆర్‌జీసీతో సమన్వయం కారణంగానే ఇది సాధ్యమైందని చెప్పారు. ఇంటెలిజెన్స్ అంచనాల మేరకు ముందుగానే సైన్యాన్ని దేశవ్యాప్తంగా మోహరించినట్టు అక్రమియా తెలిపారు. ఏదైనా దాడి ఎదురైతే తక్షణ ప్రతిస్పందనకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. విరోధ దేశాలు పలు హెచ్చరికలు చేసినప్పటికీ భూభాగంపై దాడి చేయడానికి ధైర్యం చేయలేదని ఆయన అన్నారు. ఇరాన్ భూసేనల ఉన్నత స్థాయి సిద్ధత, ఐఆర్‌జీసీతో సమన్వయం దీనికి కారణమని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఘటనలో, అమెరికాకు చెందిన శత్రుత్వ విమానంపై ఇరాన్ దళాలు వేగంగా స్పందించాయని తెలిపారు. ఆ చర్యతో శత్రువు ఆపరేషన్ విఫలమైందని అన్నారు. ఇక ఇరాన్ అధికారి మొహమ్మద్ హుస్సేన్ జియాయీనియా దేశం విజయంపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. కచ్చితంగా తామే గెలుస్తామని అన్నారు. ప్రభుత్వానికి, సైన్యానికి ప్రజల మద్దతు బలంగా ఉందని చెప్పారు. అమెరికాకు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్? (ఐఆర్‌జీసీ) గట్టి హెచ్చరికలు చేసింది యూఎస్ తిరిగి సైనిక చర్యలకు దిగితే, పరిస్థితులు చాలా దారుణంగా ఉంటాయని ఐఆర్‌జీసీ నావికాదళానికి చెందిన ఒక సీనియర్ అధికారి తెలిపినట్టు కథనాలు వెలువడ్డాయి. అమెరికా మళ్లీ దాడులకు పాల్పడితే, పశ్చిమాసియా వ్యాప్తంగా ఉన్న ఇరాన్‌కు అనుకూలమైన గ్రూపులు రంగంలోకి దిగుతాయని పేర్కొంది. అమెరికాకు చెందిన భారీ నౌకలను సముద్రంలోనే తగలబెట్టేస్తామని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. గల్ఫ్ సముద్ర జలాల్లో తమ దేశ నౌకలను సీజ్ చేయడం ద్వారా అమెరికా సముద్రపు దొంగతనాని(పైరసీ)కి పాల్పడుతోందని ఇరాన్ ఆరోపించింది. తమ నౌకలపై సైనిక శక్తిని ప్రయోగించడం ద్వారా అంతర్జాతీయ చట్టాలను అమెరికా కాలరాస్తోందని, నేరపూరిత చర్యలకు పాల్పడుతోందని పేర్కొంది. దీనిపై ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్‌తో భద్రతా మండలికి యూఎన్‌లోని ఇరాన్ రాయబారి అమీర్ సయ్యిద్ ఇరావని ఫిర్యాదు చేశారు. ఈమేరకు సమాచారంతో కూడిన ఫిర్యాదు లేఖలను ఆయన అందజేశారు. అమెరికా ఇలాంటి కవ్వింపు చర్యలనే కొనసాగిస్తే గల్ఫ్‌లో అంతర్జాతీయ వాణిజ్య నౌకల రాకపోకలకు ముప్పు పెరుగుతుందని హెచ్చరించారు. ఇరాన్ నౌకలను అమెరికా సీజ్ చేయడం అనేది అంతర్జాతీయ వాణిజ్య చట్టాలకు విరుద్ధమని అమీర్ సయ్యిద్ ఇరావని చెప్పారు.

# ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే!

ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. బుధవారం రియల్‌టైమ్ గవర్నెన్స్‌పై అధికారులతో సీఎం సమీక్షించారు. వాట్సాప్ గవర్నెన్స్, మన మిత్ర పరిధిలోకి అన్ని సేవలూ తీసుకొస్తే ప్రజలకు ఇక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని సీఎం స్పష్టం చేశారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇప్పుడు 1035 ప్రభుత్వ సేవలను అందిస్తున్నామని, ప్రభుత్వ సేవలన్నింటినీ వాట్సాప్ గవర్నెన్స్ పరిధిలోనికి తీసుకురావడం వల్ల ప్రజలకు ఇబ్బందులు లేని పాలనను అందించవచ్చన్నారు. ఇప్పటివరకూ రాష్ట్రంలో 54 లక్షల మందికి 1.75 కోట్ల సేవలను అందించామని అధికారులు వివరించగా.. ప్రజలకు ఈ సేవలపై అవగాహన కలిగించడం ద్వారా మరింత విస్తృతపరాలని సీఎం సూచించారు. ఇప్పటివరకూ 24 లక్షల మందికిపైగా వాట్సాప్, మనమిత్ర యాప్ ద్వారా సేవలందించామని అధికారులు తెలపగా.. వాట్సాప్, మనమిత్ర ద్వారా ప్రభుత్వ సేవలు పొందటంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. ఉపగ్రహ సమాచారాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు జిల్లాలో డ్రోన్‌సిటీ ఏర్పాటు తొలిదశ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ఇప్పటికే డ్రోన్ సిటీలో కార్యకలాపాలు చేపట్టేందుకు ముందుకు వచ్చిన ఎనిమిది కంపెనీలకు భూ కేటాయింపులు జరిపామన్నారు. డ్రోన్‌సిటీ మాస్టర్ ప్లాన్ ఖరారైందని వివరించారు. దీంతో ఈ ఏడాది జూలై నాటికి డ్రోన్ సిటీ మొదటి దశ పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

**సీసీ కెమెరాలతో నిఘా :** దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనంతగా ఏపీలో సీసీ కెమెరాలతో నేర నియంత్రణ చర్యలు చేపడుతున్నామని సీఎం చెప్పారు. దీనివల్ల రాష్ట్రంలో నేరాలు నియంత్రణలోకి వచ్చాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. మిస్సింగ్ కేసుల ట్రేసింగ్, వాహనాలు దొంగిలించేవారిని కనిపెట్టడం సీసీ కెమేరాల నిఘాతో సులువవుతోందన్నారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలతోపాటు.. మారుమూల ప్రాంతాల్లో ప్రైవేటు సంస్థలు, వ్యక్తుల సేవలు వినియోగించాలని సీఎం కోరారు.

# ఐదింటిలో మేమే గెలుస్తాం!

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చరిత్రాత్మక విజయం సాధించబోతోందని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. వచ్చే నెల 4న వెలువడే ఫలితాలు వికసిత్ భారత్ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తాయని, దేశ పురోగతి వేగానికి నూతన శక్తిని ఇస్తాయని అన్నారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల్లో బీజేపీ జయకేతనం ఎగురవేయడం తథ్యమని స్పష్టంచేశారు. ప్రధాని బుధవారం ఉత్తరప్రదేశ్‌లో పర్యటించి పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించి హార్దోయిలో జరిగిన సభలో ప్రసంగించారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రజలు ఈసారి నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకున్నారని, గత ఏడు దశాబ్దాల్లో ఇది కనీసం కలలో కూడా ఊహించని పరిణామం అని చెప్పారు. ప్రజాస్వామ్య వేడుకలో నేడు ఒక ముఖ్యమైన రోజు అని ఉద్ఘాటించారు.

**పశ్చిమ బెంగాల్ ప్రజలకు కృతజ్ఞతలు**

బెంగాల్‌లో మొదటి దశ పోలింగ్‌లో జరిగినట్లుగానే రెండో దశ పోలింగ్‌లో రికార్డు స్థాయిలో ఓటింగ్ జరుగుతోందని మోదీ తెలిపారు. పోలింగ్ బూత్‌ల ముందు ఓటర్లు బారులు తీరిన దృశ్యాలు సోషల్ మీడియాలో విస్తృతంగా కనిపిస్తున్నాయని చెప్పారు. తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలనే ప్రజల ఉత్సాహాన్ని ఈ ఓటింగ్ ప్రతిబింబిస్తోందని స్పష్టంచేశారు. బెంగాల్‌లో ఈసారి భయానికి తావులేని వాతావరణంలో ప్రజలు ఓటు వేస్తున్నారని పేర్కొన్నారు. ఇది దేశ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్య బలోపేతానికి ఒక శక్తివంతమైన చిహ్నమని వ్యాఖ్యానించారు. హక్కుల పట్ల అవగాహన కలిగి, పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్న పశ్చిమ బెంగాల్ ప్రజలకు మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవల బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే చరిత్రాత్మక, నిర్ణయాత్మక విజయం సాధించిందని మోదీ గుర్తుచేశారు.

# వేల కుటుంబాలకు మంచి జరుగుతుంటే ఎందుకంత అసూయ..!

- మంచి చేశారని అధికారులను సన్మానిస్తే దుష్ప్రచారం చేస్తారా..!
- వైసిపి పాలనలో 22ఏ తొలగించి ఉంటే ఏవి రిజిస్ట్రేషన్లు
- దుష్ప్రచారాలు మాని అభివృద్ధికి సహకరించండి
- ఇక 15 సంవత్సరాలు మీకు అధికారం దక్కదు
- వైసిపి, వారి సోషల్ మీడియాపై, విరుచుకుపడ్డ తెలుగు తమ్ముళ్లు



**కావలి, ఏప్రిల్ 29:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగుజాడల్లో కావలి పట్టణంలో అభివృద్ధి ప్రదాత డివి కృష్ణారెడ్డి పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి, జిల్లా అధికార యంత్రాంగం తీసుకున్న చొరవతో 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగింపు జరగటం వంటి అంశాలను జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడటం వారి అవివేకం అని తెలుగు తమ్ముళ్లు విరుచుకుపడ్డారు. బుధవారం కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాలతో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. మొన్నటి దినాన వైసిపి నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అర్థం లేని మాటలతో విమర్శలు చేశారని వాటిపై ఖండన ఇచ్చారు. ఎన్నో సంవత్సరాలుగా నిషేధిత భూముల జాబితాలో ఉన్న రెండువేల కుటుంబాలకు చెందిన 109 ఎకరాల 70 సెంట్లు రిజిస్ట్రేషన్లు కాబోతున్నాయని, వాటికి విముక్తి కలిగించిన జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అధికారులను ప్రజలు సన్మానించి వారికి అభివాదం చేస్తే చూసి ఓర్చుకోలేని గుణం కలిగిన వైసిపి నేతలు ఇష్టానుసారంగా విమర్శలు చేశారు అన్నారు. వైసిపి కాలంలో చేపట్టిన 22ఏ నిషేధిత జాబితా ఇప్పుడు విడదల చేసినదే, అది మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి చలవ అనడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. ఇదే అని వక్రీకరించి విమర్శలు చేయటం తగదన్నారు. ఆ నాడు మీరు నిషేధిత జాబితా నుంచి తొలగించి ఉంటే ఎంత మంది భూములు, నివాస స్థలాలు రిజిస్ట్రేషన్లు జరిగాయో తెలియచేయాలన్నారు. మీ కాలంలో మీకు నచ్చిన వారివి అక్కడ కొన్ని సర్వే నంబర్లు తీసుకొని వారికి మాత్రమే న్యాయం చేశారే తప్ప వెంగళరావు నగర్ ప్రాంత వాసులకు మీరు చేసింది ఏమీ లేదని ఎద్దేవ చేశారు. జిల్లా అధికారులు పెద్ద మనసు చేసుకొని కావలికి మేలు చేశారన్నారు. భూమిపైన అనుభవం కలిగిన స్థానిక ఎమ్మెల్యే సూచనలతో అధికారులు మంచి మనసు చేసుకొని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి విముక్తి కలిగించారనడం, ప్రతి ఒక్కరూ అంగీకరించి అభినందిస్తుంటే మీకు మాత్రం అది మంచి అనిపించలేదా అని విమర్శలు చేశారు. మీరు చేస్తున్న విమర్శలను బట్టి అర్థమవుతుందన్నారు. నేడు ప్రజలు అమాయకులు కాదని, ప్రతి ఒక్కటి గమనిస్తున్నారని, మీరు చెప్పేవి ఏవి నమ్మరు అని గుర్తించుకోవాలన్నారు. తద్వారా మీరే నవ్వుల పాలు కాక తప్పదు అన్నారు. మీరు ఎన్ని చేసినా, బొంకినా కావలి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కావలి కనకపట్నం కాబోతుందని వ్రాసి పెట్టుకోవాలన్నారు. అంతేకానీ అసూయ పడడం మానుకోవాలి అన్నారు. మీరు ఇలాగే విమర్శలు చేస్తూ పోతే మరో 15 సంవత్సరాలు మీకు అధికారం దక్కదు అని, మీ ఆశలు అడియాసలు కాక తప్పదు అన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని పార్టీలు కలిసి అభివృద్ధి ప్రదాత చంద్రబాబు నాయుడు పాలనలో విజయవంతంగా రాష్ట్రం ముందుకు పోతుందని, అలాగే కావలి అభివృద్ధి కావ్య కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శరవేగంగా ముందుకు పోతూ కనకపట్నం కాబోతుందన్నారు. పిచ్చోడికి మొగిలి పువ్వు ఇస్తే ఎక్కడో పెట్టుకున్నాడన్న చందంగా, మీకిచ్చిన మొగిలి పువ్వును ఎక్కడ పెట్టుకున్నారో.. మీకే తెలియలేదని ఎద్దేవా చేశారు. పథకాల పేర్లు పెట్టుకునే నైజం చంద్రబాబు నాయుడుకి లేదని, అలాగ పెట్టుకునే పని అయితే ప్రతి ఒక్కటి నేడు కొనసాగే పథకాలు అన్ని కూడా ఎన్టీఆర్ పేరు మీదనే ఉండేవన్నారు. పెన్షన్లు, రెండు రూపాయల కేజీ బియ్యం, తదితర ఎన్నో పథకాలు ఎన్టీఆర్ పేరు మీద ఉండేవన్నారు. అవి కాలక్రమేనా పార్టీలు మారుతూ పేర్లు ఎందుకు పెట్టుకున్నారని విమర్శించారు. ప్రెస్ మీట్ పెట్టేటప్పుడు వివరాలు కొంత తెలుసుకొని ప్రెస్ మీట్ పెడితే వినటానికి బాగుంటుందే తప్ప, ఇష్టానుసారంగా నోటికొచ్చినట్లు మాట్లాడి, వైసిపి పరువు తీసే నాయకులుగా మిగిలిపోవద్దని ఎద్దేవ చేశారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు ఒక విజనరి అని, ఆయన అడుగుజాడల్లో కావలి ఎమ్మెల్యే ఒక అద్భుతమైన రీతిలో కావలిని తీర్చిదిద్దడానికి కంకణం కట్టుకొని స్థానికంగా ప్రజలతో నిత్యం మమేకం అవుతూ కొనసాగుతున్న ఏకైక ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అని ప్రతి ఒక్కరు గుర్తించుకొని, ఆయనను అభినందించాలే తప్ప, విమర్శించడం మీ అవివేకానికి నిదర్శనం అన్నారు. పెట్రోలు డీజిల్ అనే అంశాలు, కూరగాయలు, టమోటాలు ఇలా అందరికీ తెలిసిన అంశాలే వాటిపై వైసీపీ ప్రెస్ మీట్ లో విమర్శలు కాదు కానీ, డెవలప్మెంట్ గురించి మీ కాలంలో ఎలా ఉంది, నేడు కూటమి ప్రభుత్వ కాలంలో ఎలా ఉందో పరిశీలించి మాట్లాడాలన్నారు. చంద్రబాబు నాయుడు వల్లే ప్రపంచంలో అమెరికా తరువాత ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి పథంలో నిలుస్తుందన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కావలి ఒక గోల్డెన్ సిటీగా తీర్చిదిద్దడానికి కావ్య కృష్ణారెడ్డి అడుగులు వేస్తున్నాడని ఈ అభివృద్ధిని చూడలేక అసూయ పడటం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు,టిడిపి సీనియర్ నాయకులు నాయకులు కండ్లగుంట మధుబాబు నాయుడు, ఏగూరి చంద్రశేఖర్, శానం హరి, ఎస్.కే రఫీ, ఇస్కు విక్రం రెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు వీరంతా వైసిపి చేసిన విమర్శలకు ప్రతి విమర్శలుగా ఘాటైన వ్యాఖ్యలతో బుద్ధి చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమినేతలు పాల్గొన్నారు.

# ఇరాన్‌కు వీసా కష్టాలు

గ్రూప్-జిలో న్యూజిలాండ్, బెల్జియం, ఈజిప్ట్‌తో పోటీపడనున్న ఇరాన్.. తమ మ్యాచ్‌లను మెక్సికోకు మార్పు చేయాలని ఫిఫాను కోరినా ఎటువంటి స్పందన లభించలేదు. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన ఫిఫా ప్రపంచకప్ డ్రా వేడుకకు సైతం ఇరాన్ ప్రతినిధులకు వీసా నిరాకరించారు. తాజాగా వాంకోవర్ సమావేశానికి సైతం వీసా నిరాకరణతోనే ఆ దేశ ప్రతినిధులు హాజరు కాలేకపోయారని తెలుస్తోంది. ఫిఫా రూల్స్ ప్రకారం ప్రపంచకప్‌లో పోటీపడే దేశ క్రీడాకారులు, సహాయక సిబ్బంది, అధికారులకు ఆతిథ్య దేశం నుంచి ఎటువంటి వీసా ఇబ్బందులు ఉండకూడదు. పలుమార్లు ఇరాన్ ప్రతినిధులు వీసా కష్టాలు ఎదుర్కొంటున్నా.. ఫిఫా నాయకత్వం ఈ అంశంలో మౌనం దాల్చటం విమర్శలకు దారితీస్తోంది. టీమ్ 'మినాబ్ 168' ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో 18 పతకాలతో సత్తా చాటిన ఇరాన్.. ఫిఫా ప్రపంచకప్‌లో పోటీపడుతూ ప్రపంచ దేశాలకు బలమైన సందేశం ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఇటీవల అమెరికాతో చర్చలకు వేదికైన ఇస్లామాబాద్‌కు బయల్దేరిన ఇరాన్ ప్రతినిధుల బృందం విమానానికి 'మినాబ్ 168'గా నామకరణం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఫిఫా ప్రపంచకప్‌లో పోటీపడే ఇరాన్ జట్టుకు సైతం మినాబ్ 168 పేరు పెట్టనున్నారు. ఈ మేరకు ఇరాన్ ఫుట్‌బాల్ ప్రతినిధులు కసరత్తు చేస్తున్నారు. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో ఈ ఏడాది ఫిబ్రవరి 28న మినాబ్‌లోని ఓ పాఠశాలపై బాంబుల వర్షం కురిపించారు. ఆ వైమానిక దాడిలో 168 మంది స్కూల్ చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దమణకాండలో మానవ హక్కుల హననానికి ఈ ఘటన నిదర్శనంగా నిలుస్తోంది. అందుకే, ఇరాన్ ఫుట్‌బాల్ జట్టు మినాబ్ 168 జెర్సీలతో ప్రపంచకప్‌లో బరిలోకి దిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. రూల్స్ పేరిట ఫిఫా ఈ ప్రయత్నాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తుందా? లేదా? అనేది చూడాలి.

# జర్నలిస్ట్ హత్య కిరాతక చర్య

**-హత్య చేయించిన వారినీ శిక్షించాలి**
**-ప్రభుత్వాలు మారినా ఎర్ర చందనం, క్వార్జ్, ఇసుక మాఫియా నిరంతర దందా**
**-మీడియాపై దాడి ప్రజాస్వామ్యంపై చేసినట్లే...**
**-సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె. నారాయణ ధ్వజం**



**గూడూరు :** చిత్తూరు జిల్లా వి.కోటలో జర్నలిస్ట్ ను అతి కిరాతకంగా హత్య చేయడం దారుణమైన చర్య అని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె. నారాయణ అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాఫియాలను ప్రశ్నిస్తే హత్యలు చేయడం ఏమిటని, మనుషుల ప్రాణాలు తీసేయడం దుర్మార్గమన్నారు. ఎర్రచందనంపై వార్తలు ప్రచురిస్తే హత్యలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. హత్య వెనుక ఉన్న మాఫియాను బయటపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో మీడియాపై దాడులు ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్లేనన్నారు. జర్నలిస్ట్ ల రక్షణ కోసం ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఇకనైనా అధికారులు నిందితులు ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసీ జిల్లా అధ్యక్షులు కొమ్మి నారాయణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్, సీపీఐ నియోజకవర్గ సహాయక కార్యదర్శి షేక్ జమాలుల్లా, ఏ ఐఎస్ఎఫ్ నాయకులు రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

# కారంపూడిఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో విలేఖరి హత్యకు నిందితులు నీ కఠినంగా శిక్షించాలని డిమాండ్

**-పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం,మణికుమార్.**





చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మంగళవారం కారంపూడి లో నిరసన చేపట్టారు. ఇసుక, ఎర్రచందనం మాఫియా అక్రమాలపై కథనాలు రాస్తున్నందుకే జగన్మోహన్ రెడ్డిని పథకం ప్రకారం హత్య చేశారని ఏపీయూడబ్ల్యూజే సభ్యులు ఆరోపించాయి. ఈ ఘటనలో అడ్డువచ్చిన మరో విలేకరిపై కూడా దాడి జరగడం మీడియాపై దాడులకు పరాకాష్ట అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.?ఈ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించి, తాసిల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ కు వినతి పత్రం అందజేశారు. జగన్మోహన్ రెడ్డి హత్యకు కారణమైన నిందితులను, సూత్రధారులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే, బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. జర్నలిస్టుల భద్రత కోసం ప్రభుత్వం వెంటనే 'జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్'ను తీసుకురావాలని ఈ నిరసన ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రిక్ మీడియా ప్రతినిధులు గుట్లపల్లి వెంకటప్పయ్య, సూరేపల్లి కోటేశ్వరరావు, అల్లి కరుణాకర్ రావు, సముద్రాల పవన్ సాయి, కల్లూరి గోపి, మనం జానీ, గుడిపాటి మణికుమార్, పెనుగొండ వెంకటేష్, బద్రి, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రజ్యోతి విలేకరిని హత్య చేసిన దుండగులను ఉరి తీయాలి

**జగన్మోహన్ రెడ్డి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి**
**విలేకరుల రక్షణకై కఠిన చట్టాలను అమలు చేయాలి**
**ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా**



**గూడూరు :** చిత్తూరు జిల్లా వీ. కోట ఆంధ్రజ్యోతి విలేకరిని అతి దుర్మార్గంగా కత్తులతో నరికి హత్యచేసిన దుండగులను ఉరితీయాలని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆర్డీఓ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు షేక్ జమాలుల్లా, మందా ప్రభుదాస్ లు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి నడుమ వారధులుగా ఉంటూ నిత్యం ప్రజా సమస్యలు, అవినీతి పరులు, ఎర్ర చందనం, ఇసుక, క్వార్జ్ మాఫియాలపై కథనాలు ప్రచురితం చేస్తున్న పాత్రికేయులపై దాడులకు పాల్పడడం, హత మార్చడం దారుణమన్నారు. వీ. కోట విలేకరి జగన్మోహన్ రెడ్డిని రౌడీ షీటర్లు హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా క్రూరంగా హత్య చేసిన దుండగులను నడి రోడ్డులో ఉరి తీయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జగన్మోహన్ రెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. మృతుని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు విలేకరుల ఐక్యత వర్ధిల్లాలి.., దుండగులను కఠినంగా శిక్షించాలి, జగన్మోహన్ రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి అంటూ పాత్రికేయులు నినాదాలు ఇచ్చారు. అనంతరం ఆర్డీఓ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధు లు పాల్గొన్నారు.

# మీరు సిద్ధమా అంటూ పిన్నెల్లి సోదరులకు ఛాలెంజ్ అంటున్న టీడీపీ నేతలు...

**- అవినీతి పై చర్చకు సిద్ధం... మీరు సిద్ధమా అంటూ టిడిపి నేతలు , వైసీపీ నేతలకు సవాల్**
**పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం, మాణికుమార్ :**



మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ హయాంలో జరిగిన అవినీతిపై టిడిపి నేతలు చర్చకు సిద్ధమంటూ పిన్నెల్లి సోదరులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కారంపూడి లోని ఆర్ అండ్ బి బంగ్లాలో టీడీపీ నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కారంపూడి మండలం అధ్యక్షులు గోళ్ళ.సురేష్ యాదవ్, చప్పిడి రాము మాట్లాడుతూ మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి కాన్వాయ్ పై జరిగిన దాడిని వారు తీవ్రంగా ఖండించారు. రెంటచింతల మండలం పసర్లపాడు గ్రామం శివారులో వెళ్తున్న కాన్వాయ్ పై బీరు బాటిల్స్ విసరడం అత్యంత నీచమైన చర్య అన్నారు. ప్రశాంతంగా ఉన్న మాచర్ల నియోజకవర్గంలో పిన్నెల్లి సోదరులు అలజడులు సృష్టించాలని ఉద్దేశంతోనే ఇలాంటి కుట్రలు పందుతున్నారన్నారు. మాచర్ల నియోజకవర్గం ఎన్నడు లేని విధంగా.. అభివృద్ధి పరుగులు పెడుతుంటే.. చూసి ఓర్వలేకనే ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడింది కాక.. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మళ్లీ మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి.. మాచర్ల నియోజకవర్గంలో ఏదో అవినీతి జరిగిపోయింది అంటూ కప్పిపుచ్చుకునే మాటలు మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. అవినీతిపై చర్చకు మేము సిద్ధం.. మీరు సిద్ధమా అంటూ పిన్నెల్లి సోదరులకు ఛాలెంజ్ చేశారు. కారంపూడి మండలంలో గత వైసీపీలో అవినీతికి హద్దులు లేకుండా పోయాయి. విచ్చలవిడిగా భూ దందాలు, అక్రమ కేసులు, బూ దోపిడిలు, అరాచకాలు మరెన్నో జరిగాయి అంటూ టిడిపి శ్రేణులు మండిపడ్డారు. మాచర్ల నియోజకవర్గం శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నడు లేని విధంగా ఎంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. మచ్చలేని ఎమ్మెల్యేగా ఉన్నాడంటే అది మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి కే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమం దుర్గి మార్కెట్ వైస్ చైర్మన్ మునుగోటి సత్యం, పట్టణ అధ్యక్షులు బొమ్మిని శేషగిరి, తండా మస్తాన్ జానీ, కటికల బాలకృష్ణ, ఎస్విఆర్ కృష్ణ, కిలారి పవన్, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కోదాడ ప్రభాకర్, కర్నాటి మహేష్, చిరుమామిళ్ల, రామ లక్ష్మయ్య, టీడీపీ నేతలు పాలుగోన్నారు.

# "పెంచలకోన లక్ష్మీ నృసింహుని కి ఘనంగా మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి పట్టువస్త్రాల సమర్పణ"






పెంచలకోన దేవస్థానం ఈఓ, అర్చకులకు సారె అందజేసిన మాలకొండ దేవస్థానం డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ దంపతులు


రాపూరు: నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకొనలో కొలువైన శ్రీ పెనుశీల లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని, ప్రకాశం జిల్లా వల్లేటివారిపాలెం మండలంలోని మాలకొండలో కొలువై ఉన్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నుండి పట్టువస్త్రాలను బుధవారం ఉదయం అత్యంత వైభవంగా సమర్పించారు.మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం తరపున డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ బృందం పట్టువస్త్రాలతో పెంచలకోన క్షేత్రానికి చేరుకోగా.పెంచలకోన దేవస్థానం అర్చకులు,అధికారులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. మంగళవాయిద్యాల నడుమ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం తరపున పట్టువస్త్రాలను, పూజా సామాగ్రిని స్వామి వారికి భక్తిశ్రద్ధలతో అందజేశారు.శ్రీ పెనుశీల లక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనం అనంతరం, పెంచలకోన దేవస్థాన ఈవో కోవూరు జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం బృందానికి వేద ఆశీర్వచనం అందజేశారు.ఈ సందర్భంగా ఇరు దేవస్థానాల అధికారులు ఆధ్యాత్మిక విశేషాలను పంచుకున్నారు.ఈ విశేష కార్యక్రమంలో మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు గౌరీ స్వామి,అర్చకులు రఘురామ,సూపరింటెండెంట్ ప్రసాద్,మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.పెంచలకోన బ్రహ్మోత్సవాల వేళ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి పట్టువస్త్రాల సమర్పణ రెండు ప్రముఖ పుణ్యక్షేత్రాల మధ్య ఉన్న ఆధ్యాత్మిక అనుబంధాన్ని చాటిచెప్పింది.

# తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలిగా వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రమాణ స్వీకారం



కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలుగుదేశం పార్టీలో కీలక బాధ్యతలను స్వీకరించారు. పార్టీ అత్యున్నత విధాన నిర్ణయాత్మక కమిటీ అయిన పొలిట్ బ్యూరో సభ్యురాలిగా ఆమె మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో ఆమె ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు.ప్రమాణ స్వీకారం అనంతరం వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఇంతటి కీలకమైన బాధ్యతను అప్పగించినందుకు పార్టీ అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలకు అండగా ఉండటానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధితో పాటు రాష్ట్ర స్థాయిలో పార్టీ అప్పగించే ఏ బాధ్యతనైనా చిత్తశుద్ధితో నిర్వహిస్తానని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పొలిట్ బ్యూరో సభ్యురాలిగా పదవి బాధ్యతల చేపట్టిన సందర్భంగా పలువురు టిడిపి రాష్ట్ర నాయకులు మరియు కోవూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

# మే 1న శ్రీ సింగరుట్ల లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణమహోత్సవం



**పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, మణికుమార్** మే1వ తేదిన శుక్రవారం సాయంత్రం 7గంటలకు కారంపూడి మండలంలోని పేటసన్నేగండ్ల గ్రామ శివారులోనీ కొండల్లో వెలసిన శ్రీ సింగరుట్ల లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణమహోత్సవం వేడుకలను అంగరంగ వైభవంగా వ్యవస్థాపక ధర్మకర్త గుండాల. శ్రీనివాసరావు, కార్యనిర్వహణ అధికారి చపారపు శివనాగిరెడ్డి, గ్రామపెద్దలు,ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని మంగళవారం తెలిపారు. కాబట్టి మండలంలోని భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణ మహోత్సవం వేడుకలలో భాగస్వాములు అవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం స్వామివారి సన్నిధానంలో భక్తులకి శ్రీ చక్ర సిమెంట్ ఫ్యాక్టరీ, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అలానే సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మే 2వ తేదిన ప్రత్యేక దీపాలంకరణలతో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి గ్రామ మహోత్సవం కార్యక్రమం కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

# నేడు (గురువారం) అనంతవరం గ్రామంలో పల్లె వీక్షణ

**-అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్వయంగా పరిశీలించనున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల**



**నెల్లూరు, ఏప్రిల్ 29 :** ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వినూత్నంగా చేపట్టిన "పల్లె వీక్షణ" కార్యక్రమం నేడు (గురువారం) దగదర్తి మండలం అనంతవరం గ్రామంలో నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ సరికొత్త ఆలోచనతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ఇప్పటికే ఆత్మకూరు మండలం బోయిల చిరువెల్ల గ్రామం, సీతారామపురం మండలం మారంరెడ్డిపల్లె గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించారు. మూడో విడతగా అనంతవరం గ్రామంలో ఈ పల్లె వీక్షణ కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా అనంతవరం గ్రామంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. ఉపాధి హామీ పథకం పనులను సమీక్షించడం, డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించడం, గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తారు. అలాగే మినీ గోకులం కేంద్రాన్ని సందర్శించి, చెత్త వర్గీకరణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. హౌసింగ్ లేఅవుట్ పురోగతిని సమీక్షించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రం, డీఆర్‌డీఏ స్టాల్, మెడికల్ క్యాంప్, వెటర్నరీ ఫీడ్ మరియు సీడ్ స్టాల్‌లను సందర్శించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామ ప్రజలతో కలెక్టర్ నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, ఫిర్యాదులను స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు.

# భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు మే 1న జిల్లాకు రాక

**-జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**

**నెల్లూరు, ఏప్రిల్ 29:** భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు మే 01వ తేదీ నుండి 03వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 01వ తేదీ (శుక్రవారం) ఉదయం 5.15 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ గెస్ట్ హౌస్ నుండి బయలుదేరి, ఉదయం 5.35 గంటలకు రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుండి ఉదయం 6.15 గంటలకు ఇండిగో విమానము ద్వారా బయలుదేరి, ఉదయం 7.35 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం ఉదయం 7.45 గంటలకు తిరుపతి నుండి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి, ఉదయం 9.15 గంటలకు వెంకటాచలం మండలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్, నెల్లూరుకు చేరుకుంటారు. సాయంత్రం 6.40 గంటలకు స్వర్ణ భారత్ ట్రస్ట్ నుండి బయలుదేరి, రాత్రి 7.00 గంటలకు నెల్లూరులోని వి.పి.ఆర్ కన్వెన్షన్‌కు చేరుకుని, 7.15 గంటలకు వివాహ వేడుకలో పాల్గొంటారు. అనంతరం రాత్రి 8.00 గంటలకు అక్కడి నుండి బయలుదేరి, రాత్రి 8.20 గంటలకు తిరిగి స్వర్ణ భారత్ ట్రస్ట్, వెంకటాచలానికి చేరుకుని అక్కడే బస చేయనున్నారు. మే 02వ తేదీ (శనివారం) ఉదయం 8.00 గంటలకు స్వర్ణ భారత్ ట్రస్ట్ నుండి బయలుదేరి, ఉదయం 8.20 గంటలకు గొలగమూడిలోని శ్రీ వెంకయ్య స్వామి దేవాలయానికి చేరుకుంటారు. ఉదయం 8.30 గంటలకు అక్కడ వెంకయ్య స్వామి గ్రంథావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు అక్కడి నుండి బయలుదేరి, ఉదయం 9.50 గంటలకు తిరిగి స్వర్ణ భారత్ ట్రస్ట్, వెంకటాచలానికి చేరుకుని అక్కడే బస చేయనున్నారు. మే 03వ తేదీ (ఆదివారం) ఉదయం 5.30 గంటలకు స్వర్ణ భారత్ ట్రస్ట్ నుండి బయలుదేరి, ఉదయం 7.00 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుండి ఉదయం 7.40 గంటలకు ఇండిగో విమానము ద్వారా బయలుదేరి, ఉదయం 9.10 గంటలకు హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# చిత్తూరు జిల్లాలో జర్నలిస్టు ను హత్య చేసిన ఘటనపై ఆత్మకూరు జర్నలిస్టులు నిరసన



**విజ్ఞాన్ దినపత్రిక ఆత్మకూరు రిపోర్టర్** చిత్తూరు జిల్లా వి.కోట మండలానికి చెందిన జగన్మోహన్ రెడ్డి అనే జర్నలిస్టు ను హత్య చేసిన ఘటనపై ఆత్మకూరులో విలేకరులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహం ఎదుట ఈ ప్రాంత జర్నలిస్టులు నిరసన నిర్వహించి నినాదాలు చేశారు. నిందితుల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు.. ఈ కార్యక్రమం దేశించి సీనియర్ జర్నలిస్టు లు సోమ. వెంకటసుబ్బయ్య, షేక్ చాంద్ బాషా లు మాట్లాడుతూ సమాజంలో జరిగే తప్పులను మీడియా ద్వారా వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యత జర్నలిస్టులదని అటువంటి జర్నలిస్టులపై దాడులు నిర్వహించి హత్య గావించడం చాలా బాధాకరమని ఇటువంటి సంఘటనలు మరలా జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లా వి.కోటలో జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డిని హత్య చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# ఆత్మజ్ఞానం

నీ శరీరం లేచి నిలబడడానికి
సహకరించని రోజు
నీ చేతులతో అన్నం కూడా
తినలేని రోజు
నీ పాదాలు ఒక్క అడుగు కూడా
వెయ్యలేని రోజు
నీ పనులకు ఇంకొకరిపై
ఆధారపడిన రోజు
నీ భావాన్ని నీ నోటితో
పలకలేని రోజు
నీ నిస్సహాయ స్థితికి
నీకే జాలి కలిగిన రోజు
నీ జీవితం మొత్తం మీద
అసలు నువ్వు ఏమి చేశావో?
అది నీకు స్పష్టంగా తెలుస్తుంది
కానీ... అప్పటికే నీ జీవితమంతా
చేజారి పోయి ఉంటుంది
నువ్వు చేసిన తప్పులు
సరిదిద్దుకునే అవకాశం ఉండదు
అన్నీ బాగున్నప్పుడే
నీ ఆరోగ్యం అనుకూలించినప్పుడే
ఆత్మ జ్ఞానం తెలుసుకో!
మార్పు ముందు నిలబడనివారు
కాలానికి బలి అవుతారు
మార్పును అంగీకరించని వారు
కాలాన్ని కూడా మార్చగలరు.



**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

# లోకేష్ కి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే మాధవి.



**గుంటూరు, ఏప్రిల్ 29.** టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయంలోని ఆయన చాంబర్ లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉ తెలుగుదేశం పార్టీ పాలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి మర్యాద పూర్వకంగా కలుసుకుని, శుభాకాంక్షలు తెలియజేశారు.

# అన్న క్యాంటీన్ లను ప్రతిరోజు పర్యవేక్షించండి : కమిషనర్ వై.ఓ నందన్



నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లను నోడల్ ఆఫీసర్లు, హరే రామ హరే కృష్ణ సంస్థకు సంబంధించిన అన్న క్యాంటీన్ సూపర్వైజర్లు,సచివాలయ కార్యదర్శులు ప్రతిరోజు పర్యవేక్షించాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో నోడల్ అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించి కమిషనర్ మాట్లాడారు. క్యాంటీన్ లలో ప్రజలకు అందుతున్న భోజన నాణ్యత, తాగునీరు, వంటశాల నిర్వహణ, ప్రాంగణంలో పారిశుద్ధ నిర్వహణ తదితర అంశాలను క్రమం తప్పకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సచివాలయ ఆమెనిటీస్, మహిళా పోలీస్ కార్యదర్శులు ప్రతిరోజు తనిఖీ చేసి ఆహార నాణ్యత, మోతాదు తదితర అంశాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని, నివేదికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందజేయాలని ఆదేశించారు. క్యాంటీన్ ప్రాంగణాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచుకొని ప్రతిరోజు పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టాలని సూచించారు. క్యాంటీన్ ల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేదా ఇతర వివరాలను తమ దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ నోడల్ అధికారులు, హరే రామ హరే కృష్ణ సంస్థకు సంబంధించిన సూపర్వైజర్లు,వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కావలిలో శివశక్తి టీవీఎస్ నూతన షోరూం ప్రారంభం

**- ఆధునిక మోడళ్లతో వినియోగదారులకు మరింత సేవలు అందించాలి**
**-కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి..**



**కావలి, బుధవారం-29:** కావలి పట్టణంలోని ట్రంక్ రోడ్డులో శివశక్తి టీవీఎస్ నూతన షోరూం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గారు షోరూంను ప్రారంభించారు. షోరూం యజమానులు సాయి మోహన్ రెడ్డి, నికిత్ రెడ్డి లు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీవీఎస్ కంపెనీ చాలా పురాతనమైన,విశ్వసనీయమైన సంస్థ అని పేర్కొన్నారు. వాహనదారుల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త కొత్త మోడళ్లను ప్రవేశపెడుతూ మోటార్ బైక్ రంగంలో ముందంజలో నిలుస్తోందని అన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాలపై పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా టీవీఎస్ కూడా ఎలక్ట్రిక్ బైక్‌లను అందుబాటులోకి తీసుకువస్తోందని, ఇది వినియోగదారులకు మరింత ప్రయోజనకరమని తెలిపారు. వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా షోరూం నిర్వహించాలని యజమానులకు సూచించారు. ట్రంక్ రోడ్డులో మంచి ప్రదేశంలో ఈ షోరూం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు సులభంగా చేరుకోవచ్చని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. నాణ్యమైన సేవలు, సమయానికి సర్వీసింగ్ అందిస్తే వినియోగదారుల విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీవీఎస్ కంపెనీ ప్రతినిధులు కూడా పాల్గొని షోరూం లోని మరికొన్ని విభాగాలను ప్రారంభించారు. స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, వినియోగదారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కావలిలో నూతనంగా ప్రారంభమైన ఈ శివశక్తి ుమీా షోరూం వాహనదారులకు ఆధునిక సేవలు అందిస్తూ ప్రాంతీయంగా ఒక ముఖ్య కేంద్రంగా నిలవనుంది.

# వైసీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

**- ఎమ్మెల్యే నిరంతర ప్రయత్నాల వల్లే సమస్య పరిష్కారం అయినది**
**- వైసీపీ నేతలు పరిష్కరించి ఉంటే రిజిస్ట్రేషన్లు ఎందుకు జరగలేదు**
**- వైసీపీ నేతలపై మండిపడ్డ టీడీపీ నేతలు**




జిల్లా కలెక్టర్ స్వయంగా నిషేధిత జాబితా నుంచి వెంగలరావు నగర్ స్థలాలను తొలగించినట్లు ప్రకటించినప్పటికీ, వైసీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. బుధవారం కావలి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ నేతలు మాట్లాడుతూ, ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి నిరంతర ప్రయత్నాల వల్లే ఈ సమస్యకు పరిష్కారం లభించిందని తెలిపారు. వెంగళరావు నగర్ ప్రాంతంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూముల వివాదాన్ని ఎమ్మెల్యే పలుమార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన అధికారులు 22-ఏ నిషేధ జాబితా నుంచి ఆ స్థలాలను తొలగించారని వివరించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ సమక్షంలో నిర్వహించిన సభలో ఈ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించారని, సుమారు 109 ఎకరాల 70 సెంట్ల భూమి 2000 మందికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అధికారులకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసినట్లు చెప్పారు. ఈ పరిణామాన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ నేతలు మండిపడ్డారు. కలెక్టర్ స్వయంగా చెప్పిన విషయాలను కూడా ఖండించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే అని విమర్శించారు. గతంలో ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించామని వైసీపీ చెప్పడం అసత్యమని, అలా అయితే ఇప్పటికీ ప్రజలు రిజిస్ట్రేషన్ సమస్యలతో ఎందుకు ఇబ్బందులు పడుతున్నారని ప్రశ్నించారు. ఇక గత ప్రభుత్వంలో భూవివాదాలు పెరిగాయని, ప్రస్తుతం వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. సోషల్ మీడియా, న్యూస్ వేదికల ద్వారా ప్రజలకు నిజాలు స్పష్టంగా తెలుస్తున్నాయని, ఇకపై తప్పుడు ప్రచారాలకు తావులేదని హితవు పలికారు. వెంగళరావు నగర్ ప్రజలకు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఉపశమనం లభించిందని, ఎమ్మెల్యే కృషిని గుర్తించి అభినందించాల్సిన అవసరం ఉందని టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, ఏగూరి చంద్రశేఖర్, కండ్లగుంట మధుబాబు నాయుడు, ఏ వెంకటేశ్వర్లు నాయుడు, శానం హరి,గంగినేని వెంకటేశ్వర్లు, షేక్ హజరత్, ఇస్కా విక్రమ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు..

# అర్బన్ బ్యాంక్ విజయంతో కింగ్ మేకర్‌గా నరాలశెట్టి ప్రకాష్

**బాపట్ల ఏప్రిల్ 29** బాపట్ల కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో నరాలశెట్టి ప్రకాష్ రావు సాధించిన విజయం సాధారణ గెలుపు కాదు. ఇది ఆయన రాజకీయ చాతుర్యం, వ్యూహాత్మక ఆలోచన, ప్రజలతో ఏర్పరచుకున్న బలమైన అనుబంధానికి నిదర్శనం. ఒక దశలో "ప్రకాష్ పని అయిపోయింది" అని విమర్శించిన వారికి, ఈ ఫలితం గట్టి సమాధానంగా మారింది. చిరునవ్వుతో అందరినీ పలకరించడం, రాజకీయ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ కలుపుకుపోయే తత్వం ప్రకాష్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయి. అందుకే అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో ఆయన నేతృత్వంలోని ప్యానల్‌కు పట్టణ ప్రజలు ఘన విజయాన్ని అందించారు. మెజారిటీ స్థానాల ను కైవసం చేసుకోవడం ద్వారా బ్యాంకు పాలనపై తన పట్టు ఏమిటో మరోసారి నిరూపించారు. ఈ విజయం వెనుక ఆయన వ్యూహం స్పష్టంగా కనిపించింది. పాత, కొత్త నాయకులను సమన్వయం చేస్తూ, పరిస్థితులకు అనుగుణంగా అడుగులు వేయడం ద్వారా ఆయన మరోసారి తన రాజకీయ మేధస్సును చాటుకున్నారు. రాజకీయాల్లో అనుభవానికి ప్రత్యామ్నాయం లేదని ఈ ఫలితం నిరూపించింది. ఇప్పుడు అందరి చూపు మున్సిపల్ ఎన్నికలహాపైనే ఉంది. బాపట్ల పట్టణంలోని 34 వార్డుల్లో ప్రకాష్ ప్రభావం ఎంతగానో ఉంటుందనే చర్చ జోరుగా సాగుతోంది. అర్బన్ బ్యాంక్ ద్వారా మధ్యతరగతి, వ్యాపార వర్గాల తో ఏర్పడిన బంధం ఆయనకు పెద్ద బలంగా మారనుంది. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రకాష్ ఎవరికి మద్దతు ఇస్తారు? ఆయన ఆశీర్వాదం ఎవరికి లభిస్తుంది? అన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది. ఆయన మద్దతు దక్కిన వర్గానికే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని స్థానికంగా చర్చ జరుగుతోంది. అందుకే ఆయనను బాపట్ల రాజకీయాల్లో "కింగ్ మేకర్"గా పలువురు అభివర్ణిస్తున్నారు. ఆయన వద్ద రాజకీయ పాఠాలు నేర్చుకున్న అనేక మంది శిష్యులు ఇప్పటికే పలు వార్డుల్లో ప్రభావం చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల్లో ప్రకాష్ పాత్ర మరింత కీలకంగా మారనుంది. ప్రకాష్ ది ఏముందిలే" అని తేలికగా తీసుకున్న వారికి అర్బన్ బ్యాంక్ ఎన్నికల ఫలితం కనువిప్పుగా మారింది. రాజకీయాల్లో అనుభవం, సమయం, వ్యూహం కలిసి వస్తే ఫలితం ఎలా ఉంటుందో ప్రకాష్ మరోసారి నిరూపించారు. రాబోయే రోజుల్లో బాపట్ల రాజకీయ సమీకరణాల ను ప్రభావితం చేసే నాయకుల్లో నరాలశెట్టి ప్రకాష్ పేరు ముందువరుసలో ఉండటం ఖాయం. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే---మున్సిపల్ ఎన్నికల కోసం ప్రకాష్ ఇప్పటికే తన వ్యూహాన్ని సిద్ధం చేసుకున్నారా? బాపట్ల రాజకీయాల్లో తదుపరి ఎత్తుగడ ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా మున్సిపల్ ఎన్నికల్లో ఆయన తోపాటు పోటీలో ఉన్న ఆయన వర్గం గెలిచే అవకాశం ఉండవచ్చు అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. మరికొందరు ఆయన ఎవరికి మద్దతు ఇస్తేవారే గెలుపు గుర్రాలుగా నిలుస్తారని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buldings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.